# నవతరం పరిశోధనలు - 19

## తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ప్రచురణలు – పరిశీలన



**నరేష్ భూక్య**, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**సెల్** : 9381431403. **మెయిల్** : nareshbhookya5@gmail.com
**కోర్సు**: Ph.D.  **రీసెర్చ్ ఏరియా**: సాహిత్యం
**పర్యవేక్షకులు**: ఆచార్య ఎ. విజయలక్ష్మి.  **పరిశోధన కాలం**: 2019 నుండి 2025

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్య ఏలె విజయలక్ష్మిగారి పర్యవేక్షణలో పిహెచ్. డి పరిశోధన చేస్తున్న నరేష్ భూక్య, "తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణలు – పరిశీలన" అనే అంశాన్ని తన పరిశోధనకు ఎంపిక చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతరం భాషా సాంస్కృతిక శాఖ నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రచురణల ప్రాధాన్యాన్ని విశ్లేషించడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం. తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్యం, జానపద సంపదను పరిరక్షిస్తూ ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటడంలో భాషా సాంస్కృతిక శాఖ పోషిస్తున్న పాత్ర తనను ఈ అంశం వైపు ఆకర్షించిందని పరిశోధకుడు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ప్రాంతీయభాషకు , సాంస్కృతిక చైతన్యానికి కొత్త ఊపు వచ్చిందని నరేష్ భూక్య పేర్కొన్నారు. తెలంగాణ కవుల, సాయుధ పోరాట వీరుల జయంతులు, వర్ధంతులు నిర్వహించడం, వారి పేర్లతో పురస్కారాలు అందించడం, కవి సమ్మేళనాలు నిర్వహించి వాటిని పుస్తకాల రూపంలో వెలువరించడం వంటి కార్యక్రమాల ద్వారా శాఖ తెలంగాణ సాహిత్య వికాసానికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా యువకవులను ప్రోత్సహించడం, తెలంగాణ భాషా వైవిధ్యాన్ని పరిరక్షించే ప్రయత్నం చేయడం తన పరిశోధనకు ప్రేరణగా నిలిచిందని చెప్పారు.

ఈ పరిశోధనలో భాగంగా వీరు 2014 నుంచి 2024 వరకు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన గ్రంథాలను అధ్యయనం చేశారు. కవిత్వం, వ్యాసాలు, నాటకాలు, జానపద అంశాలను తెలంగాణ అస్తిత్వ దృక్పథంలో విశ్లేషించారు. పరిశోధనను "తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ నేపథ్యం", "కవిత్వానుశీలన", "వ్యాస సంకలనాలు", "నాటక సాహిత్యం", "జానపద విజ్ఞానాంశాలు" అనే ఐదు ప్రధాన అధ్యాయాలుగా విభజించి, MLA ఫార్మాట్ ఆధారంగా సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. భాషా సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకులు మామిడి హరికృష్ణతో చేసిన ముఖాముఖిని కూడా పరిశోధనలో భాగంగా చేర్చారు.

పరిశోధన ప్రారంభ దశలో కరోనా మహమ్మారి కారణంగా అనేక ఇబ్బందులు ఎదురైనా, అనంతరం అవసరమైన సమాచారం, వనరులు లభించడంతో పరిశోధన విజయవంతంగా కొనసాగిందని నరేష్ భూక్య తెలిపారు. తన పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ఆచార్య ఏలె విజయలక్ష్మి, ఆచార్య చింతకింది కాశీం, ఆచార్య సాగి కమలాకర శర్మ తదితర అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. భావి పరిశోధకులు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణలను కవిత్వం, వ్యాసం, జానపదం, కార్టూన్ సాహిత్యం వంటి విభాగాలవారిగా విభజించి మరింత విస్తృతంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 20



## ఎండపల్లి భారతి సాహిత్యం - పరిశీలన

**పి. షకీల,** తెలుగు విభాగం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
సెల్: 7842728839. మెయిల్: shakilanoor224@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** ఆధ్యాత్మిక సాహిత్యం
**పర్యవేక్షకులు:** డా. వి. కృష్ణవేణి. **పరిశోధనకాలం:** 2023 నుండి 2031

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ వి. కృష్ణవేణి గారి పర్యవేక్షణలో పి. షకీలా, "ఎండపల్లి భారతి సాహిత్యం – పరిశీలన" అనే అంశంపై పిహెచ్.డి పరిశోధన కొనసాగిస్తున్నారు. పరిశోధనాంశం కొత్తదనంతో ఉండాలనే ఆలోచనతో అనేక అంశాలను పరిశీలించిన వీరి గైడ్ ఎండపల్లి భారతి గారి రచనలు చదవమని సూచించారు. ఆ రచనల్లోని భావజాలం, సామాజిక స్పృహ, మాండలిక భాష తనను ఆకట్టుకోవడంతో ఈ అంశాన్ని పరిశోధనకు ఎంపిక చేసుకున్నట్లు షకీలా తెలిపారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాల స్థాయిలో పరిశోధన జరగని రచయిత్రిపై అధ్యయనం చేసి తెలుగు సాహిత్యానికి కొత్త కోణాన్ని పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ పరిశోధన ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

వీరు తమ పరిశోధనలో భాగంగా ఎండపల్లి భారతి రచించిన కథాసంపుటాలు, నవలలను పరిశోధనకు ఎంచుకున్నారు. ఎండపల్లి భారతి రచనల్లోని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా దళిత మహిళల జీవితం, కుటుంబ సమస్యలు, పురుషుల జూద వ్యసనం వల్ల మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులు, సాంస్కృతిక ఆచారాలు, మాండలిక భాష వంటి అంశాలను పరిశోధనలో ప్రధానంగా చర్చిస్తున్నారు. రచయిత్రి ఉపయోగించిన రాయలసీమ మాండలిక భాష కూడా తన పరిశోధనలో ముఖ్య భాగమని పేర్కొన్నారు.

పరిశోధనలో భాగంగా ముందుగా అవసరమైన గ్రంథాలు, సమాచారాన్ని సేకరించి, ఒక ప్రణాళిక ప్రకారం పరిశోధన కొనసాగిస్తున్నట్లు షకీలా తెలిపారు. "ఎండపల్లి భారతి జీవితం – పరిచయం", "కథల్లో ఇతివృత్త వైవిధ్యం", "పాత్ర నిర్మాణ నైపుణ్యం", "నవలల్లో ఇతివృత్త విశ్లేషణ", "రచనల్లో శిల్ప విశేషాలు" అనే ఐదు అధ్యాయాలుగా పరిశోధనను విభజించారు. పరిశోధన ప్రారంభంలో రచయిత్రి పుస్తకాలు సేకరించడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని, పలు వెబ్‌సైట్ల ద్వారా పుస్తకాలను వెతికి తెప్పించుకోవాల్సి వచ్చిందన్నారు. రచయిత్రి ఎండపల్లి భారతి గారిని ప్రత్యక్షంగా కలిసి ఇంటర్వ్యూ చేసి అవసరమైన సమాచారాన్ని సేకరించడం పరిశోధనకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు.

రచయిత్రి మాండలిక భాషలో రాసిన కొన్ని పదాలకు అర్థం తెలుసుకోవడంలో తొలిదశలో ఇబ్బందులు ఎదురైనా, వాటిని రచయిత్రినే అడిగి తెలుసుకున్నట్లు షకీలా చెప్పారు. ఒక పరిశోధన అంశం ఎప్పటికీ పూర్తిగా ముగిసిపోదని, ప్రతి పరిశోధన కొత్త కోణాలకు దారి తీస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎండపల్లి భారతి రచించిన ఐదు కథా సంపుటాలు, రెండు నవలలపై పరిశోధన చేస్తున్నానని, భవిష్యత్తులో ఆమె కొత్త రచనలపై మరిన్ని పరిశోధనలు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 21

## పల్లిపట్టు నాగరాజు గారి సాహిత్యానుశీలన (2022 కేంద్ర సాహిత్య యువపురస్కార గ్రహీత)




**కరిమద్దెల అమృత జ్యోత్స్న**, తెలుగు విభాగం, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

**సెల్**: 9490428866. **మెయిల్**: amrutajyothsna@gmail.com

**కోర్సు**: Ph.D. **రీసెర్చ్ ఏరియా**: నవలాసాహిత్యం

**పర్యవేక్షకులు**: డా. గోపవరం పద్మప్రియ. **పరిశోధనకాలం**: 2022 నుండి 2027


విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం తెలుగువిభాగం పరిధిలో డాక్టర్ గోపవరం పద్మప్రియగారి పర్యవేక్షణలో పిహెచ్.డి పరిశోధన చేస్తున్న కరిమద్దెల అమృత జ్యోత్స్న "పల్లిపట్టు నాగరాజు గారి సాహిత్యానుశీలన" అనే అంశంపై పరిశోధన కొనసాగిస్తున్నారు. 2022 కేంద్ర సాహిత్య యువ పురస్కార్ గ్రహీత అయిన పల్లిపట్టు నాగరాజు కవిత్వంలోని ఉత్తేజభరితమైన భావాలు, ఆలోచన రేకెత్తించే శైలి తనను ఆకర్షించాయని ఆమె తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన రచయిత కావడం, ఆయన రచనల్లో కనిపించే రాయలసీమ మాండలిక భాష, ప్రాంతీయ జీవనం తన పరిశోధనకు ప్రేరణగా నిలిచాయని తెలిపారు.

పల్లిపట్టు నాగరాజు గారి కవిత్వం, కథలు, వ్యాసాల ద్వారా వారి సాహిత్య దృక్పథాన్ని విశ్లేషించడం ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశ్యం. ముఖ్యంగా వీరి రచనలలో కుటుంబ జీవనం, సామాజిక సమస్యలు, స్త్రీ జీవన చిత్రణ వంటి అంశాలు ఎలా ప్రతిబింబించాయో అధ్యయనం చేస్తున్నారు. "యాలైపూడ్సింది", "నీలికళ్ళ నేల" కవితా సంపుటాలు, "ఇద్దమర్సీ" వ్యాస సంపుటి, మినీ కవితలు, కథలు, అముద్రిత రచనలను పరిశోధన పరిధిలోకి తీసుకున్నారు. అదేవిధంగా రాయలసీమ వచన కవిత్వ శైలి, మాండలిక భాష వినియోగాన్ని కూడా విశ్లేషిస్తున్నారు.

పరిశోధన పద్ధతిలో భాగంగా పల్లిపట్టు నాగరాజు గారిని నేరుగా సంప్రదించి ఆయన రచనలను అధ్యయనం చేసినట్లు అమృత జ్యోత్స్న తెలిపారు. రచయితతో ఇంటర్వ్యూలు నిర్వహించడం, పత్రికల్లో వచ్చిన వ్యాసాలు, క్లిప్పింగ్స్ సేకరించడం ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ఈ పరిశోధనను ప్రాథమికంగా "పల్లిపట్టు నాగరాజు జీవనరేఖలు", "యాలైపూడ్సింది – విశ్లేషణ", "నీలికళ్ళ నేల", "వస్తు విశ్లేషణ", "రూప విశ్లేషణ" అనే ఐదు అధ్యాయాలుగా విభజించి పరిశోధన కొనసాగిస్తున్నారు. రచయితను నేరుగా సంప్రదించే అవకాశం ఉండటంతో పరిశోధనలో పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదని పేర్కొన్నారు.

పరిశోధన చేసే అంశంపై ముందుగా ఆసక్తి ఉండాలని, ప్రారంభం నుంచి ముగింపు వరకు ఓర్పు, పట్టుదల, నిజాయితీ అవసరమని అన్నారు. పరిశోధన కేవలం డిగ్రీ కోసం కాకుండా సమాజానికి, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. కొత్త అంశాలను పరిశోధనకు ఎంపిక చేయడం లేదా పాత అంశాలను కొత్త కోణంలో విశ్లేషించడం ద్వారా పరిశోధనకు విలువ పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

**- సంపత్ కుమార్ బానోజి**

**(మరికొన్ని పరిశోధనల పరిచయం వచ్చే సంచికలో...)**